


# ఆఖరి తడి

బడబాగ్ని శంకరరాజు

అదునుకు వానల్లేక సెనగపంట ఆశించినంత సేతికందలా. ఆలీసమైనా దీపావల్నాటికి ఒక పంటకు కావల్సినన్ని నీల్లతో సెరువు నింపింది గంగమ్మ తల్లి. మద్దెలో ఒకసారైనా గట్టివాన పడలా. సెరువులో నీరు, పైరు పాలగింజ పట్టీపట్టకముందే సాలీ, సాలకుండా అడుగంటిపాయ.

అప్పట్నించీ మా రాయలపల్లెలో ఎవునికీ ఒకరేత్తిరైనా సరైన నిద్దర్లా. ఏరేత్తిరి ఎవుడికి కాలువనీటొంతు వస్తుందో ముందే తెలీక ఈమద్దెన పెతిరేత్తిరీ సివరాత్తిరి జాగరణే.

చంద్రన్న ఆలోచనలకడ్డుకట్ట వేయడానికా అన్నట్టు. చివరకంటా కాలిన వేలూరు బీడీ వేళ్ళను చురుక్కుమనిపించడంతో, ఉలిక్కిపడి బీడీని విసిరికొట్టి కళ్ళు నులుముకొంటూ లేచి పండు వెన్నెట్లో మిలమిల మెరుస్తూ గలగల పారుతున్న నీటి కాలువకేసి నడిచాడు.

నల్లని తలవెంట్రుకలకూ, భుజాలమీది నల్లని కంబళికీ మధ్యన మొహం - కుంకమ, పసుపు ముద్దలతో మీసాలు, కనుముక్కులు తీర్చిన 'కాటంరాజు' నల్లరాయి విగ్రహం మాదిరుంటాడు చంద్రన్న. వయస్సు ఇరవై అయిదేళ్ళే అయినా, ఐదేళ్ళు ఎక్కువున్నట్టు కనిపిస్తాడు.

ఒక చేతిలో పాన్నుకర్ర, మరో చేతిలో సలంకిపార. ఈరోజు వరి పైరుకు 'ఆఖరి తడి' పెట్టడమే. ఈ ఏడాది వ్యవసాయపనుల్లో ఆపని ముట్లకు ఆఖరి డ్యూటీ.

అలవాటైన నడక. చూపులు చెరువు తూము మీదున్నా, అడుగులు క్రమం తప్పకుండా గట్టుననుసరించేముందుకుపడుతున్నాయి. చంద్రన్న ఆలోచనలు మాత్రం ఆశాజనంగా సాగటంలేదు. ఆలోచనలన్నీ తడారిన మడికయ్య గురించే.

'నూటేభై ఎకరాల వరిమడిని తడుపుకొంటూ తన మడికయ్య వరకూ నీరు అందుకొచ్చేదెపుడో? వచ్చినా నామడికవతల సిట్ట సివార్నుండే సాగుమడి రైతులు "సివర్నించే నీటొంతు పేతంభమవ్వాల" అని నా వొంతు వచ్చాక ఈ రోజూ అడ్డుపడతారేమో!! వాల్లా, పెద్దరైతులు. అందులోనూ పెద్దకులాలోల్లు. నేయమైన అన్నేయమైనా వాల్ల మాటే సెల్లుబాటు.

అసలు ఈ పెద్ద రైతులు ఈ గేమానికి సెందినోల్లుకాదు. పక్కూరోల్లు. లేక పోయినట్లయితే తూము మొదలు మాకుల పోల్ల భూముల్ని వాల్లకింతవరకూ దక్కనిచ్చిందురా!

తూము మొదలు మడికయ్యలన్నీ పారొచ్చేంతొరకూ ఏరే గతేంతరం లేక ఉక్రోసంతో ఉడికిపోతూ కూర్సొంటారు. పక్కనే వుండే నాలాటి సన్నకారు రైతులొంతు వచ్చేసరికి మాటలతో బెదరగొట్టి కాలువ నీట్నిముందుకు సాగేసుకొని పోతారు.

ఈ దబాయింపులు ఈ నాటివా! రాజులు, జెమిందార్ల కాలం నుంచి ఇదే వరస. మాకు మాకన్నోల్లు, ఆకారాలు పెద్దవే ఇచ్చారు. గానీ తరతరాల "వాల్ల" దౌర్జన్యాల కథలు మా బుర్రల్లో దట్టించి మా నరనరాల్లో పిరికితనాన్ని నింపేసారు. అదే మాకు వాల్లిచ్చే తప్పని సరి వారసత్త సంపద.


ఈ దేశ జనాభాలో మా లాటోల్లు సగమొంతుంటారంట. పెభుత్వ సట్టాల్లో సగం మా గురించి సేసిన సట్టాలే నంట. అయినా మానేయమైన నీటొంతులు మా మడికయ్యాలకందక సగం పేంట గూడా సేతికందిరావట్లేదే!

కాలుజారి శరీరం గట్టు పక్కకు దబ్బున పడటంతో చంద్రన్న బుర్రలోంచి ఆలోచనలు అర్థాంతరంగా జారుకొన్నాయి.

ఆ శబ్దానికి "ఎవడ్రాభ్భేడా! మడిగెనంకొట్టేస్తాండారు. వంతునతికమించి మడి పారగట్టుకొన్నారో మద్దిస్తం బెట్టి మీకు తగిన సాస్తి సేస్తారనోయ్!" పాన్నుకర్రను గద్దం క్రింద ఊతంగా బెట్టుకొని, నీటివంతుకోసం ఎదురుచూస్తూ నిద్దర్లోకి జారుకొని పెద్దరికం కలలుగంటూ, కలబందుల పెద్దబ్బ అన్న మాటలకు జవాబు ఇవ్వాలని పించలా చంద్రన్నకెందుకో.

ఇంతకూ - తను కాలు జారి పడటానికి కారణమేమిటా అని ఆలోచిస్తున్నాడు చంద్రన్న గెనెం మీద గడ్డి ఇంతొత్తుగా ఉండగా కాలు జరడానికి గెనెం మీదికి బురదెట్లొచ్చిందబ్బా'! అనుమానం కలిగిందే తడవు పడినవాడు పడినచోటే కూర్చొని చొక్కా జోబులోంచి తడిచీ తడవని అగ్గిపెట్టె తీసి కష్టం మీద ఒక అగ్గిపుల్లెలిగించాడు.

చంద్రన్న కనుపాపల్లో అగ్గిపుల్ల మంట పెద్దదై గట్టుక్రింద రహస్యంగా ఏర్పరచిన రంధ్రంలోంచి పెద్దబ్బ మామమడిలోకి పారుతున్న నీళ్ళలో ప్రతిబింబించింది. తక్షణమే "కిష్టడు ఊర్లోలేని సమయం సూసి వాడి కయ్యలో నీల్లు దొంగతనంగా తీసుకోవడానికి సిగ్గులేదూ?" అని పెద్దబ్బ




మామను నిలదీసి అడుగుదామనే అనిపించింది. కానీ పెద్దబ్బ మామ కులపెద్దయిపాయ. అడిగే దానికి మనసెగసలా. బారడు దూరంలో పడున్న పాన్ను కర్రను అందుకొని లేచి గట్టుమీది బురదను కాలుతో రంధ్రానికి అడ్డుగా తోసేసి ఏమీ ఎరుగని వానిలా ముందుకు సాగాడు.

అడ్డదారిన రావడం వలన పెద్దబ్బకు ఎదురు పడకుండా తప్పుకొని వచ్చిన చంద్రన్నకు - కంగారు, కంగారుగా కాలువనీరు తప్పగడుతున్నఎర్రయ్య కంట బడ్డాడు.

"రేయ్ ఎర్రిగా ఏందిరా ఆపని, మీద మడికయ్యకు సూస్తే నువ్వు తప్పగట్టేస్తాండావు. క్రిందమడికయ్య గెనానికేమో బొక్కలు. ఇంగా కిష్టిగాని మడిపారి నా వొంతొచ్చేదెపుడు" అన్న చంద్రన్న మాటలకు - ఎర్రయ్యబిరబిరా

అతని దగ్గరకొచ్చి జవాబుగా "ష్...ష్....ష్! గట్టిగా అరద్దబ్బేడా!!" అని తనచేతిలో బీడీ కట్టపెట్టబోయాడు.

చెయ్యి చటుక్కున వెనక్కి లాక్కొని "ఓహో! అదా ఇసయం, నీరుగట్టు ఎల్లప్పుడు బీడీలు లంచమిచ్చి ఏరేవాల్ల వంతులో నీమడికయ్య పారగట్టుకొంటావా - ఓరే ! ఎదుటోడు ఏమైపోయినా నీ అవసరం మాత్తరం తీరితేసాలు అనుకుంటే ఎట్రా. ఆఖరి తడప్పుడు మనలాగే అందరికీ కయ్యలు పారగట్టుకోవాలనే ఆరాటం, ఆత్రం ఉంటా యనిపించలేదేరానీకు?! నీలాటోల వల్లనేరా



లేని రంపులొచ్చి రైతులు తమ తలల్ని తామే సితగ్గొట్టుకోవాల్సొచ్చేది. అందుకే నాకొడకా ! పెద్దబ్బ మామను పిల్చి మద్దిస్తం పెట్టిస్తా ఇప్పుడే, ఇక్కడే" అని "పెద్దబ్బ మామా ! ఓ పెద్దబ్బ మామా !! నీ పెద్దరికానికి పనిబడిందిరా !" పిలిచాడు చంద్రన్న

"మీకేం పొయేగాలంరా, ఎదవనాకొడకల్లారా. ఈ రోజు వరకూ తగాదాలు లేకుండా నీల్లుగట్టుకోనీ ఆఖరి తేదిరోజున అంతేసి ఎర్రి కేకలేస్తాండారు" పిలుపునందుకొని వస్తూ అన్నాడు పెద్దబ్బ మందలింపు ధోరణిలో -

'గెనాలకు బొక్కలు బెట్టే పందికొక్కు మాదిరి కదిలొస్తాం దాడునూడు' అని మనసులో అనుకొని "ఎర్రిగాడు సేసిన పని సూసావా మామా...." అన్న చంద్రన్న మాటలను మధ్యలోనే త్రుంచేస్తూ - "సూస్తానే ఉండాగదరా అబ్బోడా ! కిష్టడి మడికి మల్లించడానికి నీల్లకడ్డంగా వేసిన అడ్డు కట్టకు బరదెగిస్తా వుండాడు తెగిపోకుండా. నువ్వేమో వాడు సేసే పనిని అపారధం సేసుకొన్నిట్లుండావు'

పెద్దబ్బ మామ మాటలకు ఎర్రయ్య "చేతలు" అతికినట్లు కనిపించడంతో, తలతిప్పి చూసిన చంద్రన్న కళ్ళు క్షణం గిర్రున తిరిగినట్లు అనిపించింది. 'అమ్మ కంతిరీ నాకొడకా " అనుకొన్నాడు మనసులో.

"మాయల మరాఠీలాంటి మామ, నిప్పురవ్వలాంటి మేనల్లుడి మధ్యన నాలాటోడు దొరికి పోకుండా పనులు జరిగేట్లు నూసుకోవాలంటే తెనాలి రామకుష్టుని తెలివుంటే గానీ సెలాయించుకోలేం" మనసులోని మాట పైకే అనేసి అక్కడి నుండి చల్లగా జారుకొన్నాడు ఎర్రయ్య. మరో మాటకు అవకాశం ఇవ్వకుండా.

పెద్దబ్బ ఎక్కడ నిలబడినోడక్కడే పొన్ను కర్ర మీద గడ్డమాన్చి కళ్ళు మూసుకొని "అ... నిరుగట్టోడు ఎక్కడ సచ్చినాడో చూడరా అబ్బోడా" పురమాయించాడు....

"ఒరే ! నీరుగొట్టోడా !!" అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్లు - అక్కడి వారి మీద చంద్రన్నలో పుట్టుకొచ్చిన విసుగూ, కోపం నీరు గట్టు వాని మీదికే మళ్ళాయి.

'ఈ డెప్పుడూ అంతే ! సరిగ్గా నీల్ల కోసం కటకటయిపోయి రైతులు నీటి పంపకం కోసం గుల్లా ముల్లా అయిపోయేటప్పుడే ఈనికి గూదరోగం వచ్చేస్తుంది. ఏసకాల నాయాలు ! ఎసకాలనాయాలు! అనుకొంటూ వడివడిగా తూమువేపు అడుగు లేసాడు చంద్రన్న.

నీరు గట్టువాడు అక్కడా కనబళ్ళా ! ఏమి చెయ్యాల్నో తోచక చెరువు కట్టమీదికి ఎక్కాడు. అక్కడెక్కడైనా ఒక చోట కూర్చొని బీడీ కాలుద్దామని - జోబులోంచి అగ్గిపెట్టె బయటకు తీస్తూండగా తనకభిముఖంగా

కట్టమీదున్న గంగమ్మ బండకాడ సీతాఫలం పొదెనక ఎవరో పెనుగులాడుకొంటున్నట్లు, అడుగుల చప్పుళ్ళూ...... మూలుగులు చెప్పక చెబుతున్నాయి.


పాన్ను కఱ్ఱను నేలకు టకా !టకా !మని తాటిస్తూ చంద్రన్న అటుకేసి అడుగులేసాడు. ఆ శబ్దం వినబడినట్లుంది వెంటనే ఒక శాల్తీ కంగారుగా పొదచాటునుంచి లేచి నిటారుగా నిలబడగా రెండవ శాల్తీ మూలుగుతూ మెల్లగా లేచి నిలబడింది. ఆ వెన్నెల్లో ఆకారాలు కనిపిస్తున్నాయేగానీ మొహాలు స్పష్టంగా కనబళ్ళా.

చి......ట్ ! మని అగ్గివుల్లెలిగించిన చంద్రన్నకు విడువడిన జుట్టుముడి చిరిగిన జాకెట్టుతో నీరుగట్టు ఎల్లప్ప భార్య కావమ్మ పక్కనే అస్తవ్యస్తంగా చుట్టుకొన్న పంచతో నిలబడివున్న నరసింహారెడ్డి కనబడ్డారు. నరసింహారెడ్డి చొక్కా జోబీచిరిగి వేలాడతా వుంది.

"దీ......దీని, కా....కా...కాలు మడగబడి పడిపోతేనూ సమయానికి నేను రాబట్టి చెయ్యిచ్చి పైకి లేపినా. లేకపోయుంటే ఈ సరికి వినాయకుని కుడుములాగా దొర్లుకోని బొయ్యి కట్టిక్రింద మడికయ్యల్లో బడుండేది.' ' లేని సహజత్వాన్ని నరసింహారెడ్డి నటిస్తూ చెప్పినా తడబాటును కప్పిపుచ్చుకోలేక పోయాడు.

"ఎంత గొప్ప సాయం సేసినావు రెడ్డీ. నీ తెల్ల పంచంతా "మన్ను" మరకలేనే. నాకు తెలీక అడుగుతా, ఇంతకూ పడింది కావమ్మా నువ్వా ?" అని, ఎటకారంగా నవ్వుతూ జవాబు కోసం ఎదురు చూడకుండా - గంగమ్మ బండకాడ కూర్చొని చేతులతో తలబాదు కొంటూ ఏక ధాటిగా రోదిస్తున్న కావమ్మ దగ్గరకెళ్ళి "అసలే మృగాలు తిరిగే సోటికి అదీ రేతిరిపూట మగోల్ల పనికి - నువ్వేగాదు దేవుడైనా సరే ఆడదాని రూపంలో వస్తే - ఇదే గతిపడ్తుందే. లేయ్......! లెయ్......! గప్‌చిప్‌గా ఇంటికెల్లిఫో !" అని చెయ్యందించాడు చంద్రన్న.

"నా.....మొ.....గునికి రూచ్చగా జొరం కాస్తాంటే, నీరు గొట్టోడు పనికి రాక పోతే, రైతుల దగ్గర మాట పడాల్సొస్తుందని, నా మొగుడొద్దంటున్నా ఇనిపించుకోకుండా వచ్చినా. అయినా యిట్టాంటి నా బట్టలుంటా రని నాకేందెలునూ. సమయానికొచ్చి నామానంగా పాడినావు నాయనా ! లేకపోయిం టే ఇట్నించిట్లనే అమ్మగారూరి దారి




పట్టాల్సొచ్చిండు" అని రెండు చేతులెత్తి దండం బెట్టి ఇంటి దారి బట్టింది కావమ్మ.

చంద్రన్న మాటలు చురుక్కుమని తగిలినా ఈ చిరుగుల ఔతారంతో ఊర్లోకెళితే బగిసెనం' అనుకొని చొక్కా చిరుగులు కనబడకుండా జారిపోతున్న పంచను ఊడబెరకి భుజాల మీదుగ నిండుగా కప్పుకొని, చిన్న నిట్టూర్పు వొదిలి చంద్రన్న వేపుతాపీగా చూస్తూ "ఔన్రా, ఈ వేళప్పుడు నువిక్కడికెందుకొచ్చినట్లో ?" అడిగాడు.

తనను తికమకపెట్టి విషయాన్ని తప్పుదారి బట్టించడానికి ఆ ప్రశ్న తనకు సంధించాడని చంద్రన్న ఇట్టే పసిగట్టేసాడు. "నువ్వు చేసిన "ఎదవపని" కోసం మాత్రం కాదులే రెడ్డీ" అన్న చంద్రన్న జవాబు 'గాలికెదురుగా ఊసిన ఉమ్మి తిరిగి తన మొహం మీదే పడినట్ల యింది నరసింహారెడ్డికి.

"ఏందిరా తలకు పొగరెక్కిందా ఏంది. పెదాచిన్నా లేకుండా మాట్లాడతావుండావు" క్రిందపడున్న తన పొన్ను కఱ్ఱను చేతికి తీసుకొని కళ్ళెఱ్ఱచేస్తూ అన్నాడు నరసింహారెడ్డి.

"తెలిసి కూడా తెలీనట్లు దిగేటోల్లతో ఇంగెట్లా మాట్లాడాల ? అయినా సెబుతున్నా. నేను నామటికి నీటొంతుకోసం వచ్చినా. మరి తమరెందుకొచ్చినట్లో ?" అన్న చంద్రన్న మాటలకు నరసింహారెడ్డి గుంట నక్కలా నవ్వాడు.

"ఈ రాత్రి - రేపు అన్న మేల వరకూ కాలువ చివర మడికయ్యలుండే మాకు, మావాళ్ళకూ పూరాగా అందరికీ వంతులుంటే, నీకు ఈ రాత్రికి నీటొంతు ఎట్లొస్తుందిరా పిల్లకాకి" అన్నాడు నరసింహారెడ్డి. ఆ మాటలకు చంద్రన్న మనసంతా 'వంట పెనంలో చెరుకు పాలలా కుతకుతలాడిపోయింది.

"ఆహా ! అట్లనా, నీరుగొట్టోడికి బీడీలు ఇచ్చో, సారాబోయించో మమ్మల్ని యామారించి పది రోజులుకు ముందు రావాల్సిన తడిని రానీకుండా తూము కాడ మడొల్లు, మార్చి, మార్చి నీల్లు పారించుకొం టూండారు. పోనీలే తగువెందుకని ఇన్నిరోజులూ గమ్మునా వున్నా. ఈరోజైనా పారగట్టుకొందామనొస్తే దబాయిస్తాండావే. ఎల్లను, ఈ రోజుమాత్రం ఆరునూరైనా అగ్గొరారం పాడైనా నామడికి నీల్లు పారగట్టందే ఇంటికెల్లను. ఆఖరి తడి సమయానికందక అసలే నామడి నెఱ్ఱెలు సీలి పోయిందాది." అని కాలువను కాళ్ళతో ఎగరదన్నుకు పోయేవానిలా విసురుగా వెనక్కి తిరిగి కాలువలోకి దిగి వేంటేసిన మట్టిని, అడుకట్టలనూ కాళ్ళతో తోసుకొంటూ దూకుడుగా ముందుకు సాగాడు.

"లేనమ్మకు మిడిసిపాటు ఎక్కువంట' మీ పాటోళ్లకుండే మడి ఏ మాత్రంరా. ఉంటే అయిదు కుంటలు ఒక్కొకరికుంటుంది. ఎవడికైనా ఎక్కువా అంటే, ముప్పై కుంటలు దాటుందా ? లేదే. మావా. ఎకరాలకెకరాలు పొలం. తడి తక్కువైతే మీరు పోగొట్టుకొనేది రెండు మూటలూ - పది మూటల మధ్యనే మేమూ ? ఒక్కొక్కరం ఒక ట్రాక్టరు వడ్లు నష్టపోతాం "

"మాకుండేది కుంట కావచ్చు లేకపోతే అరకుంటే కావచ్చు. మాకు తిండిపెట్టే భూమి రైతుగా మాకు గుర్తింపు కలిగించే భూమి ! మాకవసరానికింత అప్పు పుట్టించే భూమి ! మేము మనసులగనం చేసి కష్టించి పన్చేసే భూమి ! మా జీవిత సరొస్వం ఆకాసింత భూమే !! మీకు పదులు, ఇరవైల ఎకరాల భూములుంటే ఉండొచ్చు. అంత మాత్రాన ఎక్కువ భూములుండే వాల్లు ముందు నీల్లు పారగట్టుకోవాలనే రూలెక్కడా లేదే..... !" పొన్నుకఱ్ఱను కాలువలో కసిక్కున చెక్కుతూ జవాబిచ్చాడు చంద్రన్న.


"పోరా సద్ది మొగమా ! పౌరుషముంటే నువ్వనుకొనే వంతు ప్రకారం నీమడికి నీరు

పొరగట్టుకో చూద్దాం ! రూల్సు మాట్లాడేంత వరకూ విషయం ముదిర్నాక, మాటల్తో ఇంగ పనేముంటుంది."

"ఆ పౌరుషాలు లేకనే ఇన్నాళ్ళూ మా పొలాల్ని ఎండ బెట్టి, కాలు బురదలో బెట్ట కుండా మమ్మల్నే కూలీలుగా వాడుకొని మీ భూముల్లో పంటలు పండించుకొంటాండారు. ఈ రోజుతో మీ అగాయిత్యాలు బంద్!"

"సరే ! చూసుకొందాం లేరా, నీ ప్రాణాలు బంద్ కాకుండా వుంటేగదా మామాట"

అప్పటికే ఇరుపక్షాలకు చెందిన రైతులూ అక్కడ మూగేసారు. వాళ్ళూ తమ వంతు మాటకలిపారు. వారు పౌరుషాల సవాళ్ళ శబ్ద ఘోషలతో - తెల్లారిపోయిందనుకొని చెట్ల మీది పక్షులన్నీ కంగారుగా లేచి పైరుల మీద దిక్కుతోచనట్లు ఎగురుతున్నాయి.




అక్కడికి, అప్పుడే చేరుకొన్న గ్రామ పెద్దలు, కుల పెద్దలు అప్పటికి ఇరు పక్షాలవారికీ సర్దిచెప్పి అక్కడి నుండి పంపించేసరికి, వారి తల ప్రాణం తోకకు వచ్చింది.

అయినా వాతావరణం ఇంకా "గంభీర ముద్ర" నుంచి బయటబళ్ళా.

వెన్నెల చందమామ చిన్న బుచ్చుకొని మేఘాల్ని చాటు చేసుకొంది.

చెరువు జరగబోయే ఘోరానికి సాక్షిగా ఉండటానికిష్టం లేక మేఘాల నీడ క్రింద తల దాచుకొంది.

చెరువు కింద పచ్చని పైరులూ మంచు మాయాజాలానికి తెల్లని శిలలై పోయాయి.

తెల్లవారు ఝాము. ఇంకో పది నిముషాల్లో సూర్యుడు పొడుస్తాడనంగా చంద్రన్న మడికయ్య దగ్గర నుంచి, గుండెల్లో ఎదో పదునైన ఆయుధం గుచ్చుకొంటే పెట్టే కేక....... "హమ్మా.....!!" అంటూ వినవచ్చింది.

కొన ఊపిరితో వున్న చంద్రన్న ఛాతీ లోంచి రక్తం కాలువలై - గలగల శబ్దాలతో "వంతు" ను గుర్తుకు చేస్తూ వయ్యారంగా వొంపులు తిరుగుతూ వచ్చిన - కాలువ నీటిలో కలిసిపోయింది.

కాలువలో అడ్డంగా పడివున్న పొన్నుకర్రను సుళ్ళతో చుట్టేస్తూ "చంద్రన్న వంతు కాలువ నీరు" కొండచిలువై, రక్తంతో తడిసిన పిడి బాకులు పట్టుకొని కాలువ చివరి మడికయ్య లకేసి వడివడిగా వెళుతున్న "వారి" పాదాలను స్పృశిస్తూ పెంపుడు కుక్కలా ముందుకు సాగింది.

☆

# అంపశయ్య మీద పిచ్చితల్లి

రచన : హరిచంద్రశేఖర్



Note : 'తస్లిమా నస్రీన్' కథవిని కదిలిపోయి రాసిన కవిత ఇది.

పురాణేతిహాసాల్లో ఎక్కడైనా
బ్రతుకు భయంతో
దేశం విడిచి పారిపోతున్న
శవ సందోహాల్ని చూశారా ?
వలస పోతున్న రువాండా
ప్రాణ పక్షుల ఆకాశయానం చూశారా ?
మరణించిన దేవుడి శవయాత్రలో
సాగిపోతున్న బందుగుల ఊరేగింపులా లేదూ ?
మతి భ్రష్టుల మదన క్రీడలు
మదపు టేనుగుల విశృంఖల విలాసక్రీడలు
రాజకీయాలైనచోట
'రహదారి' మహా ప్రమాదకరం
ప్రతి అడుగుకూ ఒక మందు పాతర
కడుపుకోత ఎరుకలేని
పిచ్చితల్లి వేగటునగవు అది
చూస్తూ నిలబడ్డారేం ?
ఏదండి,
ఏ చెట్టుతొర్రలో నైనా
ఏ పుట్ట కలుగులోనైనా
దొరుకుతుందేమో వెతికి తెద్దాం
ఓ క్రొత్త రాజ్యాంగ రసాయనాన్ని ! అప్పటి దాకా ఈ అంపశయ్య మీదిపిచ్చితల్లిని,
ఎలాగైనా సరే కాపాడండి ..!!